శాశ్వత పరిష్కారమెన్నడో..?

- వరదొస్తే పాతర్లపల్లికి రాకపోకలు బంద్
- లోతట్టు ప్రాంతంలో కల్వర్టు నిర్మాణం
- ఏటా వర్షాకాలంలో తిప్పలు
- భారీ వరదలతో పంట పొలాల్లో ఇసుక మేటలు
- పట్టించుకోని పాలకులు, నెరవేరని హామీలు
- వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్


వాగుపై నిర్మించిన కల్వర్టు


ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు(ఫైల్)

ఇల్లందకుంట: భారీవర్షాలకు ఎగువన ఉన్న చెరువులు అలుగుపారితే వాగుపై ఉన్న కల్వర్టు మీదుగా వరద ఉప్పొంగి ప్రవహిస్తే ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. ఆ ఊరు ఎక్కడో కాదు ఇల్లందకుంట మండల కేంద్రం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతర్లపల్లి ముంపు గ్రామం. వరద తగ్గే వరకు గ్రామంలోని దళితకాలనీ నీళ్లలోనే ఉండే పరిస్థితి. ఏటా ఆ గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పాతర్లపల్లి వాగు దాటాలి లేదా ప్రయాణం వాయిదావేసుకోవాల్సిందే. వరదలు వచ్చిన ప్రతిసారి గ్రామం ముంపునకు గురవుతుంది. గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది. ఒకవేళ గ్రామానికి వెళ్లాలన్నా అటు నుంచి బయటకు రావాలన్నా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్‌పల్లి గ్రామం లేదా హనుమకొండ జిల్లా మర్రిపల్లి గూడెం గ్రామం నుంచి మీదుగా పది కిలోమీటర్ల దూరంఅదనంగా తిరిగి వెళ్లాల్సిందే. ఏళ్ల నుంచి వర్షాకాలంలో ఇబ్బందులుపడుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదని ఎన్నోసార్లు నాయకుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిం పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చిన సమయంలో నాయకులు వచ్చి బాధితులను పరామర్శించడం, అధికారులు వచ్చి అంచనా వేసినా పరిస్థితిలో ఏమాత్రం తేడా లేదని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతున్నామని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వరదలతో ఇసుక మేటలు

భారీ వరదలతో వందల ఎకరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేస్తోందని, ఏటా పంటలకు తీవ్ర నష్టం జరుగుతోందని, ఫీట్ నుంచి మూడు ఫీట్ల వరకు ఇసుక మేటను తొలగించాలంటే అదనంగా ఖర్చు అవుతుందని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంట పొలాల్లో పేరుకుపోయినా ఇసుకను తొలగించడానికి అయ్యే ఖర్చుతో పాటు ఎకరాకు ఎంత నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించినా ఇప్పటివరకు ఎలాంటి ఆర్థికసాయం అందలేదని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలి

సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు బ్రిడ్జి కట్టిస్తామని ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని వాపోతున్నారు. కల్వర్టు పూర్తిగా వంపులో ఉండటంతోపాటు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో చిన్న వరదలకే కల్వర్టు పైనుంచి వరద ప్రవహిస్తోందని గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా వరద ముంపునకు గురవుతున్నాం, పాలకుల పరామర్శ, ఉచిత హామీలు తప్పా ఒరిగిందేమిలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రక్షణగోడ నిర్మించాలి



వరదలతో వాగు ఉప్పొంగి ప్రవహించినప్పుడు గ్రామంలోకి నీరు రాకుండా వాగుకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలి. కల్వర్టు వద్ద వాగు విస్తీర్ణం పెంచితే వరదతాకిడి తగ్గుతుంది. పాములు, వివిధ రకాల విషపురుగుల భయంతో ప్రజలు వానాకాలం వెళ్లదీస్తున్నారు.

– కోడెం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు, పాతర్లపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం ముంపు గ్రామంగా ప్రకటించాలి. భారీ వరదలతో ఏటా వానాకాలంలో పంటలు నీట మునిగి తీవ్ర నష్టం జరుగుతుంది. కొన్నిసార్లు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. నీట మునిగి పంటలు నష్టపోయే రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– బైరెడ్డి రమణారెడ్డి, బీజేపీ నాయకుడు, పాతర్లపల్లి

'సంక్షేమ పథకాల అమలులో వివక్ష'


మాట్లాడుతున్న వీరస్వామిగౌడ్

జమ్మికుంట: గీతకార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం వివక్ష చూపుతుందని సర్వాయి పాపన్న మోకు దెబ్బ (గౌడ సంఘం) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ ఆరోపించారు. శనివారం మండలంలోని తనుగులలో ఎల్లమ్మతల్లి ఆలయ ఆవరణలో మాట్లాడారు. బీసీ కులాల్లో 14 కులాలకు ఆర్థికసహాయం అవకాశం ఇచ్చి మిగతా కులాలను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో గౌడ కులస్తులు ఏ ఒక్క పథకానికి నోచుకోలేదన్నారు. వైన్ షాపుల్లో 15శాతం రిజర్వేషన్‌తో ఏ లాభం లేదని, బినామీ పేర్లతో డబ్బున్న దొరలే వైన్ షాపులను దక్కించుకుంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో నీరా ప్రాజెక్టు ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల గీతకార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. గీతకార్మికుల విషయంలో పునరాలోచించాలని, రూ.10 లక్షల గౌడబంధు ఇవ్వాలన్నారు. లేకుంటే రాబోయే ఎన్నికల్లో గౌడ కులస్తులు ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జిల్లా నాయకుడు తాళ్ళపెల్లి శంకరయ్యగౌడ్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు జక్కె రాజయ్య, అశోక్, పంజాల వీరయ్యగౌడ్, పోశాల శ్రీనివాస్, చంద్రమొగిలి, చేరాలు, సమ్మయ్య, సదయ్య, రవి, సుమన్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లబ్ధిదారులు

గంగాధర: మండలంలోని కోట్లనర్సింహులపల్లి గ్రామానికి చెందిన 40 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంజూరు చేశారు. శనివారం పట్టాలు పొందిన లబ్ధిదారులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోట మల్లారెడ్డి, సాయిలు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మైనర్లకు వివాహం చేయొద్దు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానకొండూర్: మండల కేంద్రంలోని బుడిగజంగాల కాలనీలో ఓ బాలికకు వివాహం నిశ్చయమైందని గ్రామస్తులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం కాలనీకి చేరుకొని, విచారణ చేపట్టారు. బాల్యవివాహాలతో జరిగే నష్టాలపై బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐసీడీఎస్ అధికారులు అరవింద, ఆర్‌ఐ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ అరుణ పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి


దేవాలయం ఆవరణలో అన్నదానం

జమ్మికుంట: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయం(బొమ్మల గుడి)లో వ్యాపారవేత్త రామడుగు రవీందర్‌రావు, దేశిని కోటి, కౌన్సిలర్ పొనగంటి రాములు జన్మదినం సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ ప్రముఖులు జన్మదిన, వివాహ మహోత్సవం, ఇతర శుభకార్యాల రోజున అన్నదానం చేస్తే పేదల ఆకాలి తీర్చినవారు అవుతారని అన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


గంగాధర: క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

రామడుగు: దివ్యాంగుల పింఛన్ మరో వెయ్యికి పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్,క ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు చిమ్ముల శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్, బత్తిని అంజయ్య, పొన్నం సంతోష్,చెవి రాజు, మొగిలి కుమార్, శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..


క్షీరాభిషేకం చేస్తున్న వికలాంగుల సంఘం నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ దేవాలయం ఆవరణలో పింఛన్ పెంచడంపై మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి వికలాంగుల సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జుగురు సదానందం, దయ్యాల శ్రీనివాస్, నాయకులు భోగం వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కొత్త వినీత

చిగురుమామిడి: మండల కేంద్రంలోని అలంగిరి మజీద్‌కు వెళ్లేందుకు ఎంపీపీ కొత్త వినీత సీసీరోడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం మజీదు, దేవాలయాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తుందని, అన్ని మతాలు, కులాలకు సమన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ తిరుపతి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, మండల ప్రచార కార్యదర్శి రాంబాబు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు, ఎండీ సర్వర్‌పాషా, ఎస్‌డీ అంకూస్, ఎండీ మైసుద్దీన్, యాకూబ్ పాషా, ఆంజనేయులు, ఇర్ఫాన్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుపరిపాలన దినోత్సవం


మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ఇల్లందకుంట: నూతనంగా ఏర్పడిన ఇల్లందకుంట మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలం ఏర్పడిన నాటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ హైస్కూల్ ఆవరణలోని ఎమ్మార్సీ భవనానికి తరలించారు. అనంతరం ఎంపీపీ పావని అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలతో ప్రజలకు పాలన చేరువవుతోందని, కొత్త మండలం, గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ప్రజల వద్దకు పాలన సులభతరమైందన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆర్డీవో హరిసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రజలకు పనులు త్వరగా పూర్తవుతున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవి, సర్పంచ్ శ్రీలత, మండల వ్యవసాయ అధికారి రజిత, సర్పంచులు రఫీఖాన్, రాజిరెడ్డి, విద్యాధికారి శ్రీనివాస్, ఏపీఎం రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. మక్త, చింతగుట్ట, కల్వల, గొల్లపల్లి గ్రామ పంచాయతీలో సుపరిపాలన దినోత్సవం సందర్భంగా అధికారులు ప్రగతిని వివరించారు. మక్త గ్రామంలో డీఎల్‌పీవో లత మాట్లాడారు. ఎంపీడీవో బషీరొద్దీన్, సర్పంచ్‌లు సుష్మ, రజిత, భద్రయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణ ప్రజలకు సత్వర సేవలు అందిచేందుకు ప్రభుత్వం టీఎస్‌బీపాస్, ఇతర ఆన్‌లైన్ సేవలను ప్రవేశ పెట్టిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. చొప్పదండిలో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఆధ్వర్యంలో తెలంగాణ సుపరిపాలన దినోత్సవం నిర్వహించగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆన్‌లైన్ సేవలతో మెరుగైన పరిపాలన ముందుకు వచ్చిందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లను అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రాజశేఖర్, ప్రశాంత్‌కుమార్, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.


శంకరపట్నం: మాట్లాడుతున్న డీఎల్‌పీవో లత


ఇల్లందకుంట: మాట్లాడుతున్న ఎంపీపీ పావని

ఆధ్యాత్మికం

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన పెద్దమ్మతల్లి విగ్రహాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దర్శించుకున్నారు. శనివారం ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వెంట బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు కొంరయ్య, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ తిరుపతి, మండల ప్రచార కార్యదర్శి రాంబాబు, పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమేశ్, మామిడి సంపత్, పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

విరాళం అందజేత

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి దాతలు శనివారం విరాళం అందజేశారు. ఉమ్మడి వెంకటేశ్వర్లు, ఉమ్మడి సురాచారి రూ.10,016 చొప్పున ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదు ఇచ్చారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


బొమ్మనపల్లిలో పెద్దమ్మతల్లికి మొక్కులు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

చిత్ర కథ: కుంటను తలపిస్తున్న చౌరస్తా



మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని తూర్పు దర్వాజ చౌరస్తా వద్ద ఇసుక వాహనాలతో రోడ్డు గుంతలమయమైంది. రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరంతా గుంతల్లోకి చేరి కుంటను తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దళారులను మించిన దోపిడీ

- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కరువు
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దళారులను మించి రైతులను పదింతలు దోచుకుంటున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు మండిపడ్డారు. శనివారం ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దళారులు ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు మట్టి, సంచికి కలిపి తూకంలో రెండు కిలోలు కటింగ్ చేసేవారని, ఇప్పుడు మార్వోస్టింగ్ ద్వారా మట్టి లేకున్నప్పటికీ క్వింటాల్‌కు సుమారు ఏడు కిలోలు కటింగ్ చేస్తుంటే పట్టించుకునే నాథుడే లేడని సర్పంచ్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ సంతోష్ సభలో ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్ల ద్వారా రూ.కోట్లలో కమీషన్ దండుకుంటున్న సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను దోచుకుంటుంటే అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని నిలదీశారు. మిషన్ భగీరథ నీరు రావడంలేదని, కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు కాజేశారని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సూచించారు. దశాబ్ది ఉత్సవాలు నిర్వహించినందుకు పలువురు సర్పంచులను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ బావ్‌సింగ్, ఎంపీడీవో పద్మావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాచారం

బీసీ సంక్షేమ సంఘం శంకరపట్నం మండల అధ్యక్షుడిగా అభిలాష్


నియామకపత్రం అందుకుంటున్న అభిలాష్

శంకరపట్నం: బీసీ సంక్షేమ సంఘం శంకరపట్నం మండలం అధ్యక్షుడిగా కేశవపట్నం గ్రామానికి చెందిన బొంగోని అభిలాశ్ నియామకమయ్యారు. జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య శనివారం నియామకపత్రం అందించారు. ఈసందర్భంగా ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ జక్కని సంజయ్‌కు అభిలాశ్ కృతజ్ఞతలు చెప్పారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం


రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంపత్‌రెడ్డి

తిమ్మాపూర్: నుస్తులాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా రెండోసారి ఎన్నికైన గుజ్జుల రవీందర్‌రెడ్డిని రామకృష్ణకాలనీ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. రైతుల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల భూమిరెడ్డి, కోశాధికారి సంది మోహన్‌రెడ్డి, సర్పంచ్ మీసాల అంజయ్య, ఉపసర్పంచ్, రెడ్డి సంఘం ఉపాధ్యక్షుడు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

గౌడసంఘం అధ్యక్షుడిగా మొగిలి



శంకరపట్నం: మండలంలోని తాడికల్ గౌడ సంఘం అధ్యక్షుడిగా మొలుగూరి మొగిలి ఎన్నికయ్యారు. శనివారం సంఘం ఎన్నికలు నిర్వహించారు. అనంతరం మొగిలిని నాయకులు సన్మానం చేశారు.